# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 193 | సోమవారం, 15 జూన్ 2026 | పేజీలు : 4





# ఇక ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులు

## ▪ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఆదివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఫౌండేషన్ కోర్సులపై ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పీఎం శ్రీ, మోడల్ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతి విద్యార్థులకు జేఈఈ, నీట్, క్లాట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలపై అవగాహన కల్పించి, అవసరమైన పునాదులను బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. ఎంపిక చేసిన 28 పాఠశాలల్లో సోమవారం నుంచి ప్రత్యక్ష ఆన్‌లైన్ తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. గణితం, విజ్ఞానశాస్త్రం, ఇంగ్లీష్ అంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ భావనాత్మక అవగాహన పెంపొందించేలా కోర్సులు రూపొందించామని వివరించారు. నిపుణుల ఆధ్వర్యంలో జరిగే ఈ తరగతుల్లో విద్యార్థులు తమ సందేహాలను నేరుగా నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అన్ని పాఠశాలల్లో నిర్ణీత సమయానికి



తరగతులు తప్పనిసరిగా నిర్వహించి, హాజరు, బోధన వివరాల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై ఆసక్తి పెరిగి, ఉన్నత లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో విద్యాశాఖ అధికారులు, ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







# దళిత హిందువుల హక్కులను పరిరక్షించాలి

## – మారేడు మోహన్



**జనగామ, మన చౌరాస్తా:** దళిత హిందువులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను పరిరక్షించాలని ఎస్సీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారేడు మోహన్ అన్నారు. తోకల హరీష్ అధ్యక్షతన జనగామలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం షెడ్యూల్డ్ కులాల గుర్తింపు చారిత్రక సామాజిక వివక్ష ఆధారంగా కల్పించబడిందన్నారు. దళిత హిందువుల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధి కోసం రాజ్యాంగం ప్రత్యేక రక్షణలు కల్పించిందని తెలిపారు. మతం మారిన వారికి కూడా ఎస్సీ హోదా కల్పించాలనే డిమాండ్లు పెరుగుతున్న నేపథ్యంలో, దళిత హిందువులకు లభిస్తున్న రిజర్వేషన్లు, ఉద్యోగ, విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఏకు తిరుపతి, కొంపల్లి అరవింద్, బింగి రమేష్, గండి నాగరాజు, మరపాక అనిల్, గంధం రాములు, చందు, డాక్టర్ కార్తీక్, సందీప్, ఆరూరి భాస్కర్, హనుమకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# మౌలిక వసతుల కల్పనకు కృషి

- జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ బాలమణి

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ పట్టణంలోని పూసల భవన్‌లో ఆదివారం పూసల హౌసింగ్ మాక్స్ పాలకవర్గం ఆధ్వర్యంలో 15వ వార్షికోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కడకంచి బాలమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలమణి మాట్లాడుతూ, కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి మున్సిపాలిటీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలియజేయాలని సూచించిన ఆమె, నివాసితుల భాగస్వామ్యంతో కాలనీని మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ప్రజల సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# ఆర్‌టీవీ ప్రతినిధిపై దాడి హేయనీయం

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ)

**జనగామ, మన చౌరాస్తా:** విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టీవీ ప్రతినిధి వెంకటరత్నంపై జరిగిన దాడిని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) జనగామ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. యశ్వంతాపూర్ సమీపంలో జరిగిన లారీ ప్రమాదాల నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలపై గ్రౌండ్ రిపోర్ట్ చేయడానికి వెళ్లిన ఆర్‌టీవీ ప్రతినిధి గొల్లపెల్లి వెంకటరత్నంపై లారీ యజమాని దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. గత రెండు రోజుల్లో మూడు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా, ఎనిమిది మంది తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే క్రమంలో జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇటువంటి ఘటనలు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తాయని సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. దాడిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు ఇది తమ పరిధిలోకి రాదంటూ జనగామ, రఘునాథపల్లి పోలీసులు స్పందించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై అసలు కేసు నమోదైందా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన లారీ యజమానిపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల భద్రతకు చర్యలు చేపట్టాలని టీయూడబ్ల్యూజేఐజేయూ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్ల బస్సులను అడ్డుకోవద్దు

- గ్రామీణ పిల్లలు పెద్ద బడుల్లో చదువొద్దా?
- ప్రభుత్వ టీచర్లు వాళ్ల పిల్లలెందుకు సర్కార్ బడుల్లో చేర్చట్లే?
- హెచ్‌డుప్సా జిల్లా అధ్యక్షుడు తక్కళ్లపెల్లి బుచ్చిబాబు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతుండగా, గ్రామీణ ప్రాంతాల పేదల పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదవకుండా అడ్డుకోవడం సమంజసం కాదని హనుమకొండ అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తక్కళ్లపెల్లి బుచ్చిబాబు అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలల బస్సులను అడ్డుకోవడం, పిల్లలను చేర్పిస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని బెదిరించడం తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య అందించడంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ అనుమతులు, నిబంధనలకు అనుగుణంగానే పాఠశాలలు నడుస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల బస్సులను అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను ఎక్కడ చదివించాలనేది తల్లిదండ్రుల హక్కు అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెచ్‌డుప్సా జిల్లా చీఫ్ అడ్వైజర్ వర్ధమాన్ జనార్ధన్, ప్రధాన కార్యదర్శి సంతోష్ రెడ్డి, ఖజాంచి శంకర్ తదితరులు పాల్గొన్నారు.





# ముల్కనూర్ మల్లికార్జున స్వామి దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం నూతన కమిటీని ఆదివారం యాదవ కుల పెద్దలు, గ్రామస్థుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో చైర్మన్‌గా జక్కుల మల్లికార్జున్, ఉపాధ్యక్షులుగా దొండ ఐలయ్య, గిరబోయిన కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా ముడికే భిక్షపతి, ఖజాంచిగా జక్కుల రాజమౌళి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కుల పెద్దలు మాట్లాడుతూ, ఆలయ నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వార్షిక బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక పూజలను మరింత వైభవంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఆలయ అభివృద్ధి, భక్తుల సేవ కోసం అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఆలయ ప్రాంగణ అభివృద్ధి, ఆదాయ వనరుల పెంపు, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు.

# జనగామలో 2.9 కిలోల గంజాయి స్వాధీనం




**జనగామ, మన చౌరాస్తా:** జనగామ బస్‌స్టాండ్ పరిసరాల్లో పోలీసులు నిర్వహించిన తనిఖీలలో 2.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఆదివారం సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రతీష్, పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలు, అనుమానిత వ్యక్తుల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న మిసాల శ్యామ్, కాశిబోయిన గౌతమ్, గుండా కార్తీక్‌లను తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైంది. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని జనగామ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పసరమడ్లలో ఆధునిక సాంకేతిక కేంద్రం



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకు మంజూరైన రెండు ఆధునిక సాంకేతిక కేంద్రాల ద్వారా యువతకు నైపుణ్య శిక్షణతో పాటు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ కేంద్రాల్లో శిక్షణ పూర్తి చేసిన యువత సొంతంగా సంస్థలు ఏర్పాటు చేసుకునే అవకాశమూ ఉంది. జనగామ మండలం పసరమట్ల గ్రామంలో రెండు ఎకరాల స్థలంలో కేంద్ర నిర్మాణానికి సంబంధించి సర్వే అధికారులతో చర్చించారు. అనంతరం రెవెన్యూ, సర్వే అధికారులు స్థల హద్దులు నిర్ణయించి సంబంధిత సంస్థకు భూమిని అప్పగించారు. త్వరలో శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి, కేంద్ర బాధ్యులు రామానందం, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసలు అప్పు.. భారమా.. భాగ్యమా..?



## ఆర్థిక అభిమన్యులు



- అట్లూరి గణేష్, ఫైనాన్షియల్ ఎడ్యుకేటర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, రచయిత.

**అప్పు అనేది అసలు శాపమా? లేక వరమా? అది భారమా? భాగ్యమా? అప్పు అనేది ఒక పదునైన కత్తి లాంటిది. దాన్ని ఎలా వాడుతున్నామనే దాన్ని బట్టి అది ప్రాణం తీయగలదు, లేదా ప్రాణం కాపాడగలదు. ఆర్థిక నిపుణులు అప్పులను రెండు రకాలుగా విభజిస్తారు. ఒకటి మంచి అప్పు, రెండు చెడు అప్పు..!**

రైల్లో కిటికీ పక్కన కూర్చుని, వేగంగా వెనక్కి వెళ్తున్న చెట్లను చూస్తున్నాడు రఘు. చేతిలో ఐఫోన్ లేటెస్ట్ మోడల్ ఉంది. బ్రాండెడ్ వాచ్ మెరుస్తోంది. కానీ, అతని మనసులో మాత్రం ఒకటే అలజడి. వచ్చే వారం ముప్పైయ్యో తారీఖు రాబోతోంది. అంటే... శాలరీ క్రెడిట్ అయ్యే రోజు. ఒకప్పుడు జీతం వచ్చే రోజు అంటే పండుగ. కానీ, ఇప్పుడు రఘుకు అది ఒక బ్యాడ్ డే. ఎందుకంటే, జీతం అకౌంట్‌లో పడటమే ఆలస్యం.. హోమ్ లోన్, కార్ లోన్, పర్సనల్ లోన్, మూడు క్రెడిట్ కార్డుల ఈఎమ్ఐలు ఆ మొత్తాన్ని గుటకాయస్వాహా చేసేస్తాయి. ఒకటవ తారీఖు సాయంత్రానికి అకౌంట్ చూస్తే మళ్లీ 'కరువు' వెక్కిరిస్తుంది.

రఘు సాఫ్ట్ వేర్ ఇంజనీర్. పదేళ్ల క్రితం ఇరవై వేల రూపాయల జీతంతో కెరీర్ స్టార్ట్ చేశాడు. ఈ రోజు అతని జీతం నెలకు రెండు లక్షల రూపాయలు. పదింతలు పెరిగింది. మరి జీవితం మారాలి కదా? సమాజంలో గౌరవం, బ్యాంకులో బ్యాలెన్స్ పెరగాలి కదా? కానీ, వాస్తవం ఏంటంటే... పదేళ్ల క్రితం ఇరవై వేల జీతం ఉన్నప్పుడు రఘు ప్రశాంతంగా నిద్రపోయేవాడు. ఇప్పుడు రెండు లక్షల జీతం ఉన్నా, లోపల ఏదో తెలియని భయం, గుండెల్లో నిరంతరం అలజడి. ఇది కేవలం రఘు ఒక్కడి కథ కాదు. నేటి ఆధునిక సమాజంలో ప్రతి పది మందిలో ఆరుగురి పరిస్థితి ఇదే...

### పెరిగే ఆదాయం.. తరిగే జీవితం

మన తాతల కాలంలో ఒక సామెత ఉండేది."దుప్పటి ఉన్నంత వరకే కాళ్లు చాచుకోవాలి" అని. కానీ నేటి డిజిటల్ యుగంలో ఆ సామెత మారిపోయింది. "కాళ్లు చాచుకుంటూ వెళ్లు... దుప్పటిని అప్పు రూపంలో ఈఎమ్ఐలో కొనుక్కోవచ్చు" అనే సిద్ధాంతాన్ని జనం నమ్ముతున్నారు. గత దశాబ్ద కాలంలో దేశంలో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజల జీతాలు భారీగా పెరిగాయి. ఐటీ రంగం, కార్పొరేట్ ఉద్యోగాలు, స్టార్టప్‌ల పుణ్యమా అని చేతిలోకి.. అదేనండీ అకౌంట్ లోకి డబ్బు బాగానే వస్తోంది. కానీ, చిత్రం ఏంటంటే.. జీతాలు పెరుగుతున్నకొద్దీ, మనుషుల జీవితాల్లో సుఖశాంతులు పెరగడం లేదు, సగటు మనిషి అప్పుల ఊబిలో మరింత లోతుగా కూరుకుపోతున్నాడు. గణాంకాలు చెబుతున్న చేదు నిజం ఏంటంటే.. మన దేశంలో సగానికి సగం పైగా దాదాపు 60% మంది ఉద్యోగులు ఏదో ఒక రకమైన అప్పు భారం కిందే బతుకుతున్నారు. ఒక అప్పు తీర్చడానికి ఇంకో అప్పు చేయడం, ఒక క్రెడిట్ కార్డ్ బిల్లు కట్టడానికి మరో క్రెడిట్ కార్డ్ నుండి డబ్బులు విత్‌డ్రా చేయడం నేటిరోజుల్లో సర్వసాధారణం అయిపోయింది. జీతం పెరగడం అనేది ఒక భ్రమ. ఎందుకంటే జీతంతో పాటు మన ఖర్చులు, అంతకంటే వేగంగా మన లగ్జరీలు పెరిగిపోతున్నాయి. దీన్నే ఫైనాన్షియల్ టెర్మినాలజీలో 'లైఫ్‌స్టైల్ క్రీప్' (Lifestyle Creep) అంటారు.

### మంచి అప్పు (Good Debt) – ఇది భాగ్యం

ఏ అప్పు అయితే మీ జేబులోకి తిరిగి డబ్బును తీసుకువస్తుందో, లేదా మీ ఆస్తుల విలువను పెంచుతుందో అది మంచి అప్పు. ఉదాహరణ చూస్తే...ఎడ్యుకేషన్ లోన్ : దీనివల్ల మీ నైపుణ్యం పెరిగి, భవిష్యత్తులో ఎక్కువ సంపాదించవచ్చు.

**బిజినెస్ లోన్ :** వ్యాపారాన్ని విస్తరించి లాభాలు ఆర్జించడానికి చేసే అప్పు.


**సముచితమైన హోమ్ లోన్ :** అద్దె కట్టే బదులు, స్థిరాస్తి సమకూరుతుంది కాబట్టి ఇది ఒక పరిమితి లోపు తీసుకుంటే మంచి అప్పు అవుతుంది. అయితే, స్టేటస్ కోసమో, డాబు చూపించుకోవడం కోసమో రఘు మాదిరిగా లగ్జరీ విల్లా తీసుకోవడం అంటే అది మంచి అప్పు కిందకు రాదు.

### 2. చెడు అప్పు (Bad Debt) – ఇది భారం


ఏ అప్పు అయితే మీ జేబులో ఉన్న డబ్బును ఖర్చు చేయిస్తుందో, కాలక్రమంలో దాని విలువ తగ్గిపోతుందో అది చెడ్డ అప్పు. ఇది ముమ్మాటికీ భారమే.

**కార్ లోన్ లేదా బైక్ లోన్ :** షోరూమ్ నుంచి కారు బయటకు రాగానే దాని విలువ 20% పడిపోతుంది. అలాంటి క్షీణించే ఆస్తి (Depreciating Asset) కోసం భారీగా వడ్డీలు కట్టడం చెడ్డ అప్పు.

**క్రెడిట్ కార్డ్ బకాయిలు & పర్సనల్ లోన్స్ :** లగ్జరీ హాలిడేస్ కోసం, బ్రాండెడ్ డ్రెస్ ల కోసం, లేటెస్ట్ గ్యాడ్జెట్ల కోసం 15% నుండి 40% వరకు వడ్డీ ఉండే ఈ అప్పులు చేయడం మిమ్మల్ని నేరుగా అప్పుల ఊబిలోకి నెట్టేస్తుంది. రఘు చేసినవి "చెడ్డ అప్పులు", రాము ఒకవేళ అప్పు చేసినా అది "మంచి అప్పు" పరిధిలోనే ఉంది.




## రాము వర్సెస్ రఘు



ఈ పరిస్థితిని మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి రఘుతో పాటు అతని చిన్ననాటి స్నేహితుడు రాము స్టోరీ కూడా చూడాలి. ఇద్దరూ ఒకే ఊరి నుంచి వచ్చారు, ఒకే కాలేజీలో చదివారు, ఒకే కంపెనీలో ఉద్యోగం సంపాదించారు. ఇద్దరి జీతాలూ సమానమే. కానీ ఇద్దరి ఆలోచనా విధానాలు వేరు.

### రఘు – సొసైటీలో స్టేటస్ కోసం..

రఘుకు సమాజంలో తను ఒక రేంజ్‌లో కనిపించాలనే కోరిక ఎక్కువ. జీతం పెరగగానే మొదట బైక్ మార్చి బ్రాండెడ్ కార్ కొన్నాడు. దానికోసం 7 సంవత్సరాల ఈఎంఐ సెలెక్ట్ చేసుకున్నాడు. ఆ తర్వాత తను ఉంటున్న టూబీహెచ్‌కే ఫ్లాట్ చాలదన్నట్లు, సొసైటీలో స్టేటస్ కోసం ఒక లగ్జరీ త్రీబీహెచ్‌కే గేటెడ్ కమ్యూనిటీ విల్లాను కొన్నాడు. దానికోసం కోటిన్నర అప్పు చేశాడు. ఐఫోన్ కొత్త మోడల్ రాగానే పాత ఫోన్ బాగున్నా సరే, క్రెడిట్ కార్డ్ నోకాస్ట్ ఈఎమ్ఐ ఉంది కదా అని కొనేస్తాడు. ప్రతి వీకెండ్ లోనూ.. పబ్‌లు, మాల్స్, బ్రాండెడ్ డ్రెస్‌లు. రఘు దృష్టిలో ఇదంతా "లైఫ్ ఎంజాయ్ చేయడం". సమాజంలో మన స్టేటస్ పెంచుకోవడం. ఎదుటివాళ్లకు మనం ఓ రేంజ్‌లో ఉన్నామన్న భావన చూడగానే కొట్టొచ్చినట్లు కనిపించాలన్న తపన అతన్ని ఈ దారిలో పరుగులు పెట్టిస్తోంది.

### రాము - నా భవిష్యత్తు భద్రమేనా?

అయితే, రాము మాత్రం అలా కాదు. జీతం పెరిగినా తన పాత కారునే వాడుతున్నాడు. ఇల్లు సొంతంగా కొనే ముందు తన దగ్గర ఎంత డౌన్ పేమెంట్ ఉందో చూసుకున్నాడు. జీతంలో కనీసం 40 శాతం డబ్బును SIP, మ్యూచువల్ ఫండ్స్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ లలో ఇన్వెస్ట్ చేస్తాడు. మిగిలిన దాంతోనే నెలంతా ఇల్లు గడిచేలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటాడు. రఘు తరహా లగ్జరీలు రాముకు లేవు, అలాంటి ఆలోచనలు కూడా దగ్గరికి రానీయడు. కానీ, రాము ముఖంలో ఎప్పుడు చూసినా.. ఒక నిశ్చింత, ప్రశాంతత కనిపిస్తాయి.

### కనువిప్పు కలిగించిన రాత్రి

ఒకరోజు రాత్రి రఘుకు గుండెల్లో నొప్పి వచ్చింది. భార్య కంగారు పడి హాస్పిటల్‌లో జాయిన్ చేసింది. డాక్టర్లు పరీక్షించి, తీవ్రమైన ఒత్తిడి అంటే.. విపరీతమైన స్ట్రెస్ వల్లే ఇలా జరిగిందని, కొన్ని రోజులు ఉద్యోగానికి సెలవు పెట్టి రెస్ట్ తీసుకోవాలని చెప్పారు. బెడ్‌పై పడుకున్న రఘు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నెల నెలా వచ్చే రెండు లక్షల జీతం ఆగిపోతే.. మరుసటి నెల ఇంటి ఈఎమ్ఐ ఎలా కట్టాలి? కారు సీజ్ చేస్తారేమో? సొసైటీలో తల ఎలా ఎత్తుకోవాలి? తన వెనుక భార్యాపిల్లల పరిస్థితి ఏంటి? తన అకౌంట్‌లో కనీసం మూడు నెలల ఖర్చులకు సరిపడా ఎమర్జెన్సీ ఫండ్ కూడా లేదు. అప్పుడే అతనికి అర్థమైంది. తాను ఇంతకాలం బతికింది ఒక భ్రమల ప్రపంచంలో అని. తన లగ్జరీ లైఫ్ స్టైల్ ఒక అట్టల కోట అని, చిన్న గాలివానకే అది కూలిపోతుందని తెలిసివచ్చింది. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాక రాము అతన్ని చూడటానికి ఇంటికి వచ్చాడు. రఘు ఏడుస్తూ తన పరిస్థితి చెప్పాడు. అప్పుడు రాము నవ్వుతూ ఒక మాట అన్నాడు.

"రఘు... నువ్వు సంపాదన పెంచావు కానీ, నీ 'ఫైనాన్షియల్ ఐక్యూ' పెంచుకోలేదు. మనం ఎంత సంపాదిస్తున్నాం అన్నది ముఖ్యం కాదు, అందులో ఎంత దాస్తున్నాం, ఆ దాచిన డబ్బుతో ఎలా మరికొంత డబ్బును సృష్టిస్తున్నాం అన్నదే ముఖ్యం. జీతం పెరిగిన ప్రతిసారీ ఖర్చులు పెంచుకుంటూ పోతే, జీవితాంతం ల్యాబ్‌లో చక్రంపై పరిగెత్తే ఎలుకలా ఉండిపోవాల్సిందే తప్ప గమ్యాన్ని చేరలేం." అని హితబోధ చేశాడు రాము. ఆ క్షణంలో రఘుకు కనువిప్పు కలిగింది. బ్రాండెడ్ బట్టలు, లగ్జరీ కారు సమాజానికి చూపెట్టడానికే తప్ప, తన అంతర్గత ప్రశాంతతకు కావాల్సింది 'ఆర్థిక స్వేచ్ఛ' అని గ్రహించాడు.

### అప్పుల ఊబి నుండి బయటపడటం ఎలా?

ప్రతి ఒక్కరూ మిమ్మల్ని మీరు ఒక ప్రశ్న వేసుకోండి. మీరు రఘు దారిలో ఉన్నారా? లేక రాము దారిలో ఉన్నారా? ఒకవేళ మీరు కూడా అప్పుల భారంతో సతమతమవుతుంటే, ఈరోజే ఈ 4 సూత్రాలను పాటించడం మొదలు పెట్టండి.

**1.బడ్జెట్ నియమం (50/30/20 Rule) :** మీ నికర ఆదాయంలో 50% అవసరాలకు, 30% కోరికలకు కేటాయించి, కనీసం 20% ఖచ్చితంగా పొదుపు లేదా పెట్టుబడి చేయండి.

**2.ఎమర్జెన్సీ ఫండ్ (Emergency Fund) :** ఎలాంటి లోన్లు లేకుండా, కనీసం మీ 6 నెలల ఖర్చులకు సరిపడా డబ్బును ఎప్పుడూ బ్యాంకు అకౌంట్లో లేదా లిక్విడ్ ఫండ్స్ లో దాచుకోండి. ఉద్యోగం పోయినా లేదా ఆరోగ్యం పాడైనా ఇది రక్షణ కవచంలా పనిచేస్తుంది.

**3.డెట్ స్నోబాల్ సిస్టం (Debt Snowball) :** మీకు ఉన్న అప్పులన్నింటినీ చిన్న దాని నుండి పెద్దదాని వరకు ఒక లిస్ట్ రాసుకోండి. మొదట చిన్న అప్పులను పూర్తిగా తీర్చేస్తూ వెళ్ళండి. ఒక అప్పు తీరగానే వచ్చే మానసిక ధైర్యం, మిగిలిన పెద్ద అప్పులను తీర్చడానికి మీకు బూస్ట్ ఇస్తుంది.

**4. క్రెడిట్ కార్డుల వాడకం తగ్గించండి :** క్రెడిట్ కార్డ్ అనేది అవసరానికి వాడుకునే వరం, కానీ ఉచితంగా డబ్బు వస్తోంది కదా అని షాపింగ్ చేస్తే అది మీ భవిష్యత్తును కాల్చేసే నిప్పు అని అర్థం చేసుకోండి.

***డబ్బు సంపాదించడం ఒక ఎత్తు అయితే, దాన్ని నిలబెట్టుకోవడం, విలువను పెంచుకోవడం మరొక ఎత్తు. అప్పు అనేది మీ ఎదుగుదలకు తోడ్పడే "భాగ్యం" కావాలే తప్ప, రాత్రిళ్లు మీ నిద్రను దూరం చేసే "భారం" కాకూడదు. గుర్తుంచుకోండి.. లోకానికి మీ రిచ్‌నెస్ చూపించడం ముఖ్యం కాదు, నిజంగా మీ జీవితంలో "వెల్త్ నెస్" ఉండటం ముఖ్యం. జీతాలు పెంచుకోవడంతో పాటు, మన ఆర్థిక అవగాహనను కూడా పెంచుకుందాం. జీవితాలను ఆనందమయం చేసుకుందాం..***



# హెల్త్ క్యాంపునకు విశేష స్పందన

**జనగామ, మన చౌరాస్తా :** ఆయుష్మాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో సుమారు 280 మంది పాల్గొని వైద్య సేవలు పొందారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెద్ద సంఖ్యలో రోగులు హాజరై చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వివిధ సమస్యలపై పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స సూచనలు పొందారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రజల స్పందన ఉత్సాహభరితంగా ఉండటంతో రోజంతా శిబిరం సందడిగా సాగింది. ఆస్పత్రి నిర్వహించిన తొలి ప్రత్యేక చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరంగా ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది. భవిష్యత్తులో కూడా ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ఇలాంటి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ వర్షిత సేవలు అందించగా, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ గౌతమ్ రెడ్డి, డాక్టర్ జూలీ, నిర్వాహక సంచాలకుడు డాక్టర్ లయన్ జైన్ రమేష్ పాల్గొన్నారు.





# కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు

- ప్రతి కార్యకర్త పార్టీకి సైనికుడు కావాలి
- అక్రమ కేసులకు భయపడద్దు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపిల అడ్డంకులను అధిగమించి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, బీఆర్ఎస్ పార్టీ 100 సీట్లతో ఘనవిజయం సాధిస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి చేస్తున్న మాయమాటలను తెలంగాణ ప్రజలు ఇప్పటికే గమనిస్తున్నారని, వాటిని తిప్పికొడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దేవరుప్పుల మండలం కోలుకొండలో ఆదివారం జరిగిన పాలకుర్తి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కార్యకర్తలకు దిశానిర్దేశం ...ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ, ప్రతి బూత్ కన్వీనర్ బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఓట్ల సవరణ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. "మన బూత్ మన బాధ్యత" అనే నినాదంతో ప్రతి ఇంటికి వెళ్లి, నాన్‌లోకల్ ఓటర్లను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించేలా సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ ఇంచార్జీలు ప్రతిరోజూ అందుబాటులో ఉండి, నాయకులను సమన్వయం చేస్తూ నిరంతరం సమాచారాన్ని అందించాలి.సభ్యత్వ నమోదులో మహిళలను, యువతను, సీనియర్ నాయకులను భాగస్వాములను చేయాలి.ప్రతి కార్యకర్త పార్టీ కోసం సైనికుడిలా పనిచేయాలి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేయకుండా పార్టీ కోసం పోరాడాలి. తాను కూడా గతంలో 15 ఏళ్లు ప్రతిపక్షంలో ఉండి జైలుకు వెళ్ళానని ఆయన గుర్తు చేశారు. గతంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సర్పంచ్‌లకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేష్, బిఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ వై. సతీష్ రెడ్డి, మోటివేషనల్ స్పీకర్ శ్రీపాద రామ్, హన్మకొండ మాజీ జెడ్పీ ఛైర్మన్ సుధీర్ కుమార్, రమాకాంత్, మరియు పాలకుర్తి నియోజకవర్గంలోని 6 మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వయస్సులో హాఫ్ సెంచరీ.. రక్తదానంలో సెంచరీ..

- వంద సార్లు రక్తదానం చేసిన డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్



**హైదరాబాద్, మన చౌరస్తా:** "హలో మిత్రమా.. ఛలో, రక్తదానం చేసి వద్దాం" అంటూ రక్తదానంపై అవగాహన కల్పిస్తూ అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్, టుబాకో కంట్రోల్ హీరో అవార్డు గ్రహీత మాచన రఘునందన్. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ఎదురుచూస్తున్న వారికి సహాయం చేసే గొప్ప అవకాశం రక్తదానం ద్వారా లభిస్తుందన్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి సంవత్సరానికి మూడు సార్లు వరకు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం వల్ల మనఃసంతృప్తితో పాటు ఒక ప్రాణాన్ని కాపాడిన ఆనందం లభిస్తుందని చెప్పారు. ఆపదలో ఉన్న వారిని రక్షించే వారు హీరోలైతే, తమ రక్తంతో ఇతరుల ప్రాణాలు కాపాడేవారు కూడా జీవితాంతం హీరోలుగానే నిలుస్తారని పేర్కొన్నారు. ఇప్పటివరకు తాను 100 సార్లు రక్తదానం చేసినట్లు రఘునందన్ వెల్లడించారు.



# ఎంసీహెచ్ వద్ద అన్నదానం

**జనగామ, మన చౌరాస్తా:** ఓడపల్లి శాంతి 5వ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త ఓడపల్లి నాగభూషణం, కుమార్తెలు సంగం రవళి, పోల్కం ఇందు, అల్లుళ్లు భరత్, స్వప్నిల్ జనగామ జిల్లా మాతా శిశు కేంద్రం వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీంరాజు మాట్లాడుతూ మహా అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించిన ఓడపల్లి నాగభూషణం కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సందర్భం ఏదైనా ఆకలితో ఉన్నవారికి ఒక పూట భోజనం అందించేలా సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కొయ్యడ రవి, పండుగ నరేష్, బింగి నరసింహులు, సిద్ధిరాల నవీన్, కోడం మణి, సాంబయ్య, వీణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**